గంజాయి రవాణా చేస్తున్న తొమ్మిది మంది అరెస్ట్

- టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరిబాబు
- ఆరు కేజీల గంజాయి స్వాధీనం



విజయవాడ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరిబాబు, అధికారులు, ముసుగులో నిందితులు

విజయవాడస్పోర్ట్స్: ఒడిశా ఏజెన్సీ ప్రాంతాల నుంచి విజయవాడకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మరో తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏడీసీపీ) ఆర్.శ్రీహరిబాబు చెప్పారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు నిర్దేశించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గడిచిన 30 రోజుల్లో 94 మందిని అరెస్ట్ చేసి 230 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, 32 కేసులు నమోదు చేశామన్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్ కేసులో నిందితులుగా ఉన్న మరో తొమ్మిది మందిని తాజాగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం మీడియాకు వివరించారు. జిల్లా యాంటీ నార్కోటిక్ సెల్, లా అండ్ ఆర్డర్ బృందాలు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు సంయుక్తంగా సోదాలు నిర్వహిస్తోందన్నారు. గతంలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. పక్కా సమాచారంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న తొమ్మిది మందిని తాజాగా అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. కృష్ణాజిల్లా నందివాడకు చెందిన చాగల్లు కృష్ణ చైతన్యరెడ్డి, తోట్లవల్లూరుకు చెందిన చాట్ల రవితేజ, పెనమలూరుకు చెందిన వేములవాడ శివరామకృష్ణ, కృష్ణలంక రాణిగారితోటకు చెందిన కోరాడ అజయ్, పటమటకు చెందిన గద్దం లక్ష్మణరావు, భవానీపురానికి చెందిన రేమల్లి కీర్తన్, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కొక్కుల రుత్విక్, తుళ్లూరుకు చెందిన కలియపూడి అనిల్‌కుమార్, పసుపులేటి నరేష్‌ను అరెస్ట్ చేశామన్నారు.

జల్సాలకు అలవాటు పడి..

నిందితులపై గతంలోనే సత్యనారాయణపురం, కృష్ణలంక, పటమట పోలీస్ స్టేషన్లలో ఎన్డీపీఎస్ యాక్ట్ కేసులు నమోదయ్యాయని ఏడీసీపీ శ్రీహరిబాబు తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన వీరందరూ ముందుగా గంజాయిని సేవించడానికి అలవాటు పడ్డారన్నారు. ఆ తరువాత అదే గంజాయిని అక్రమ రవాణా చేసి సులువుగా డబ్బు సంపాదించాలనే మార్గాన్ని ఎంచుకున్నట్లు వెల్లడించారు. ఒరిస్సాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన గంజాయిని పలు మార్గాల ద్వారా విజయవాడకు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పారు. అత్యధికంగా యువతకు వీరందరూ గంజాయిని విక్రయిస్తున్నట్లు తమ విచారణతో తేలిందన్నారు. వీరిలో కలియపూడి అనిల్‌కుమార్, పసుపులేటి నరేష్, గద్దం లక్ష్మణరావు రేమల్లి కీర్తన్ గతంలో గంజాయి కేసులో అరెస్ట్ అయ్యి జైలు జీవితం అనుభవించినట్లు చెప్పారు. అయినా వాళ్ల ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయించడం, సేవిస్తున్న వ్యక్తుల సమాచారాన్ని 91211 62475కు తెలియజేయాలని ఈ సందర్భంగా ప్రజలను ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఏసీపీ దామోదర్, సీఐ రమేష్, ఎ.రాజాజీ, శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

విజయవాడస్పోర్ట్స్: ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు. రెడ్ సర్కిల్ నుంచి ఆర్టీఏ జంక్షన్, శిఖామణి సెంటర్ నుంచి వెటర్నరీ జంక్షన్, బెంజ్ సర్కిల్ నుంచి డీసీపీ బంగ్లా కూడలి వరకు ఎలాంటి వాహనాలను అనుమతించమన్నారు. కంట్రోల్ రూమ్ నుంచి బెంజిసర్కిల్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఆర్టీసీ వై జంక్షన్, స్వర్ణ ప్యాలెస్, దీప్తి సెంటర్, చుట్టుగుంట, గుణదల, రామవరప్పాడు రింగ్ మార్గాన్ని, బెంజ్ సర్కిల్ నుంచి ఎంజీ రోడ్డు ద్వారా బస్టాండ్‌కు వచ్చే వాహనాలు ఫకీర్‌గూడెం, స్క్యూ బ్రిడ్జి, నేతాజీ బ్రిడ్జి మార్గాన్ని అనుసరించాలని సూచించారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

- ఏఏ పాస్‌లు కలిగిన వారు స్టేడియం మూడో నంబర్ గేటు నుంచి లోపలికి ప్రవేశించి వాహనాలు అక్కడే పార్కింగ్ చేసుకోవాలి.
- ఏ1, ఏ2 పాస్‌లు ఉన్న వారు నాల్గవ గేటు నుంచి ప్రవేశించి హ్యాండ్‌బాల్ కోర్టులో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- బీ1, బీ2 పాస్‌లు కలిగిన వారు, పురస్కార గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులు రెండో గేటు ద్వారా ప్రవేశించి ఫుట్‌బాల్ కోర్టులో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.
- స్కూల్ విద్యార్థులు, ఇతర ఆహ్వానితులు వాటర్ ట్యాంక్ రోడ్డులోని ఆరు, ఏడు నంబర్ గేట్ల ద్వారా ప్రవేశించి వాహనాలను అక్కడే పార్కింగ్ చేసుకోవాలి.
- పాస్‌లు ఉన్న వ్యక్తులు ఉదయం 8 గంటల లోపు స్టేడియానికి చేరుకోవాలి.

దుర్గ గుడి వేద పాఠశాలలో సదుపాయాలపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామరావు తదితరులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో దేవదాయ శాఖ కమిషనర్ మాట్లాడారు. పోరంకిలోని వేద పాఠశాలను బుధవారం దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు, ఈఈ లింగం రమాదేవి సందర్శించారు. వేద పాఠశాలలో విద్యార్థులకు దేవస్థానం కల్పిస్తున్న సదుపాయాలు, ఆహార పదార్థాల నాణ్యత, విద్యాభ్యాసం గురించి నేరుగా విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత వేద పాఠశాలకు చేరుకున్న కమిషనర్ సత్యనారాయణ పాఠశాల ఆవరణలో కలియ తిరుగుతూ వసతుల గురించి ఆరా తీశారు. వంట గదితో పాటు సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడగడమే కాకుండా వాటికి తగిన సమాధానం చెప్పిన వారిని అభినందించారు. పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో పూల మొక్కలను పెంచడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు అవసరమైన ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కేర్ టేకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

13 మంది ఉద్యోగాలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కల్పించేందుకు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని జిల్లా ఉపాధి అధికారి విక్టర్‌బాబు తెలిపారు. విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా జరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 73 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 13 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారన్నారు. జాబ్‌మేళాను రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రామ్మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం తనిఖీ చేసిన జేడీ



చోరంపూడి సబ్ సెంటర్లో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న నోడల్ అధికారి రమేష్

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను రాష్ట్ర వైద్య శాఖ జాయింట్ డైరెక్టరు, 104 ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ రమేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్లో నిర్వహించిన 104 ప్రోగ్రాం వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందుతున్న సేవల వివరాల తెలుసుకుని మందులు అందుబాటులో ఉన్నదీ, లేనిది వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలందినప్పుడే 104 వైద్య శిబిరం ఉద్దేశం నెరవేరుతుందన్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో వైద్యులను, సిబ్బందిని అభినందించారు. శిబిరంలో పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యులు కె.సువర్చల, వి.జయశ్రీ , చిన్నికృష్ణ సూపర్‌వైజర్లు ఎం.యేసుదాసు, ఏడుకొండలు, అఖిల, రాజారావు, ఇందిర, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతి

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకుంటారని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్య ద్వారానే వినయం విధేయత వస్తుందని, మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్న వారు జీవితంలో ఉన్నత శిఖరాలు అందుకుంటారన్నారు.

అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఆయన సత్కరించారు. కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి పేరు పెట్టాలి

ఎంపీ బాలశౌరి



చిలకలపూడి(మచిలీపట్నం): బందరులోని ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెట్టాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మువ్వన్నెల జెండా ఎగుర వేస్తున్నామంటే దానికి కారణం బందరు వాసి వెంకయ్య తయారు చేసిన త్రివర్ణ పతాకమేనని, జిల్లాలో పుట్టి స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా పోరాడారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి పేరు పెట్టడంతోనే ఆయనకు మనం అర్పించే ఘన నివాళి, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం పార్లమెంట్ ప్రజలకు ఎంపీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

గురువులకు పాదపూజ

కేంద్రీయ విద్యాలయంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006వ సంవత్సరం పూర్వ విద్యార్థులు కుటుంబ సమ్మేళన్-2024 కార్యక్రమం పేరుతో నిర్వహించారు. విద్యాలయం ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులతో పాటు విద్యాలయంలో పనిచేసిన 50 మందికి పైగా పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయులు దేశం నలుమూలల నుంచి ఈ సమ్మేళనానికి విచ్చేశారు. తొలుత ఉపాధ్యాయులకు పూర్వవిద్యార్థులు పాదపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల వేదిక కోసం షెడ్డు నిర్మాణం చేపట్టడానికి పూర్వ విద్యార్థులందరూ తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

మెరిసిన మువ్వన్నెల పతాకాలు



ఘంటసాలలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో అనూహ్య, ఎంఈవో మోమిన్, విద్యార్థులు



పెడనలో తిరంగా ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



మచిలీపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

గూడూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు తిరంగా ర్యాలీలు నిర్వహించారు. మల్లవోలు, కంకటావ, రాయవరం, కంచాకోడూరు, పిండివారిపాలెం, ఆకుమర్రు తదితర గ్రామాల్లో విద్యార్థులు మువ్వన్నెల పతాకాలు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు.

ఘంటసాలలో తిరంగా ర్యాలీ

ఘంటసాల: ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని ఘంటసాల ఎంపీడీవో టి.అనూహ్య విజ్ఞప్తిచేశారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంపీడీవో అనూహ్య ప్రారంభించారు. ర్యాలీ ప్రధాన రహదారి మీదగా మండల పరిషత్ కార్యాలయం వరకు సాగింది. తొలుత హైస్కూల్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్, ఎంఈఓ- 2 మోమిన్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన జాతీయ భావం

మచిలీపట్నంటౌన్: నగరంలో బుధవారం జాతీయ భావం వెల్లివిరిసింది. గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సంస్థల ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో 365 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీని కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభించారు. బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చిలకలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న భారత జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సన్‌స్టార్ స్కూల్, స్టార్ కళాశాల విద్యార్థులు జాతీయజెండాను చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఇలా పలు సంస్థల ఆధ్వర్యంలో నగరంలో జాతీయజెండాలతో ర్యాలీలు నిర్వహించటంతో నగరం త్రివర్ణ శోభితమైంది.

పెడనలో తిరంగా ర్యాలీ

పెడన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు, కళాశాల విద్యార్థులు కలసి బుధవారం పట్టణ వీధుల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజయానంద డిగ్రీ కాలేజి విద్యార్థులతో కలసి గూడూరు రైల్వే గేట్ వరకు అధికారులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీఓ ఎస్.బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జాతీయ పతాక రూపకర్త పింగళి విగ్రహావిష్కరణ

గూడూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రామరాజుపాలెంలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించనున్నారు. గోల్డ్ ప్రిన్స్ సంస్థల అధినేత చలమలశెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి వెంబడి ఉన్న జీపీ పెట్రోల్ బంక్‌లో వెంకయ్య విగ్రహం ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా 100 అడుగుల జాతీయ పతాకాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా గురువారం ఉదయం పింగళి విగ్రహావిష్కరణ, జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసింహారావు తెలిపారు.

కృత్తివెన్నులో...

కృత్తివెన్ను: తిరంగా ర్యాలీలలో భాగంగా బుధవారం మండలంలోని సంగమూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయజెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో వి.రాంబాబు, ఎంఈవో ప్రసాదరావు, హెచ్‌ఎం పద్మజారాణి పాల్గొన్నారు.

విభజన భయానక సంస్మరణ దినోత్సవం



ప్రదర్శనను తిలకిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దేశ విభజన సందర్భంగా లక్షలాది మంది ప్రజల కష్టాలను స్మరించుకుంటూ డివిజన్ వ్యాప్తంగా 'విభజన భయానక సంస్మరణ దినోత్సవం' నిర్వహించినట్లు విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విభజన భయానక ఫొటో గ్యాలరీని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య మనవరాలు పింగళి సుశీల, ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన స్వాతంత్ర్య సమరయోధుడు గోపరాజు వెంకట అనంతశర్మ మనవడు గోపరాజు వెంకట రఘురామ్‌లతో కలిసి డీఆర్‌ఎం లాంఛనంగా ప్రారంభించారు.

నాటక స్పందనకు విశేష స్పందన

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 2021 ఆగస్టు 14 నుంచి విభజన భయానక సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. వారి త్యాగాలను తెలియజేసేలా విజయవాడతో పాటు డివిజన్‌లోని మచిలీపట్నం, ఏలూరు, భీమవరం టౌన్, తెనాలి, బాపట్ల, ఒంగోలు, గూడూరు, తుని, అనకాపల్లి, నెల్లూరు స్టేషన్లలో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శించిన 'నేలని అడుగు చెబుతుంది' అనే నాటక ప్రదర్శనకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. చివరిగా రైల్వేస్టేషన్ కూడలిలోని పింగళి వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పించి, త్రివర్ణాల బెలూన్‌లను ఎగురవేశారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు రూ.50వేలు ఆర్థిక సాయం

బంటుమిల్లి: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల తరఫున బుధవారం రూ.50వేలను కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు పాఠశాల డైరెక్టరు సాబూజాన్ తెలిపారు. విరాళాల సేకరణకు కృషి చేసిన ఉపాధ్యాయులను, విద్యార్థులను సాబూజాన్, ఝాన్సీసాబూ అభినందించారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

మోపిదేవి: స్థానిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో దుర్గాసాగర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

ఇంజినీరింగ్ డిగ్రీతో ఉద్యోగ అవకాశాలు పుష్కలం



కోనేరుసెంటర్: ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు తాము ఎంపిక చేసుకునే విభాగం గురించి పూర్తి అవగాహన కలిగి ఉంటేనే రాణించగలరని చెప్పారు. 90 శాతం మార్కులు సాధిస్తేనే ఇంజినీరింగ్ విద్యార్థికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ.. కష్టపడకుండా ఫలితం ఆశించకూడదన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిష్టాత్మకమైన కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులను అభినందించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీన్ ఆచార్య వైకె సుందరకృష్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న మినీవ్యాన్.. మహిళ దుర్మరణం

8 మంది కూలీలకు తీవ్ర గాయాలు

ఎ.కొండూరు: ఇబ్రహీంపట్నం - జగదల్పూర్ జాతీయ రహదారిపై చీమలపాడు హరిజనవాడ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందగా 8 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎ.కొండూరు ఎస్‌ఐ చల్లా కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చీమలపాడు హరిజనవాడకు చెందిన కూలీలు పొలం పనులకు ఆటోలో వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న మినీవ్యాన్ అతివేగంగా ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న మొక్కలకత్తి పుల్లమ్మ(54) అక్కడికక్కడే దుర్మరణం చెందగా 8 మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించామని ఎస్‌ఐ తెలిపారు. వీరిలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సమాచారం తెలుసుకున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు క్షతగాత్రులను పరామర్శించి, బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ మోర్ల లక్ష్మి ఉన్నారు.

భార్యపై గొడ్డలితో దాడి



విస్సన్నపేట: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తేనేటి కాంతామణిపై భర్త సురేష్ గొడ్డలితో దాడి చేసిన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మద్యం మత్తులో సురేష్ కాంతామణిపై గొడ్డలితో వెనుక నుంచి దాడి చేశాడు. ఆమె తలకు తీవ్రమైన గాయం కావటంతో బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాంతామణి స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

అవనిగడ్డ: అక్రమంగా మద్యం రవాణా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. కోడూరు వెళ్లే రోడ్డులో బెల్టు షాపులో అమ్ముకోవడానికి తీసుకెళుతున్న ఒక వ్యక్తి దగ్గర 8 మద్యం సీసాలను ఎస్‌ఐ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్టు ఎస్‌ఐ చెప్పారు.

తపాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాల విక్రయం

- హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



జాతీయ జెండా విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ తిరంగా రన్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొనాలని శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ జెండా విక్రయ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ టి.నాగరాజు, సబ్ పోస్టుమాస్టర్ టి.గిరీష్, పోస్టుమాన్ ఎస్.నరేష్, ఏబీపీఎం కె. నాగరాజు పాల్గొన్నారు.

మట్టి, ఇసుక, బుసక అక్రమాలపై ఉక్కుపాదం మోపండి

- చట్టబద్ధ పాలన చేసే అధికారులకు బహిరంగ సన్మానం
- మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

నాగాయలంక: మన, తన లేకుండా మట్టి, ఇసుక, బుసక అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. అరాచకాలకు తావు లేని చట్టబద్ధ(రూల్ ఆఫ్ లా)పాలనను పూర్తి నిబద్ధతతో చేసే అధికారులను బహిరంగంగా ప్రజల సమక్షంలో సన్మానిస్తానని ప్రకటించారు. ఎంపీపీ రాఘవ రాణి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తే చాలు చాలా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. బియ్యం అక్రమ రవాణా నిరోధించకపోవడం విచారకరమని అన్నారు. మండలంలో చాలామంది యువత గంజాయికి బానిస అయినట్టు తెలుస్తోందని, అలాంటి దురలవాట్ల నివారణకు తక్షణం పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ టీవీఎం రామదాసు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోందని, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని అభ్యర్థించారు. సెప్టెంబరు నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ ఎం.హరనాథ్ చెప్పారు. తొలుత ఇటీవల మరణించిన వైస్ ఎంపీపీ పరిశె అమ్మన్న మృతికి సభ్యులు సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. అనంతరం మండల సమావేశానికి తొలిసారి హాజరైన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను ఎంపీపీ, అధికారులు, పాలకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు సన్మానించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.కె.రామ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నాగాయలంక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్‌కు ఉప్పాల పరామర్శ

కృత్తివెన్ను: వైఎస్సార్‌సీపీ మండల లీగల్ సెల్ కన్వీనర్ వైదాని ప్రసాద్‌ను పార్టీ పెడన నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రమేష్ (రాము) బుధవారం పరామర్శించారు. ఇటీవల ప్రసాద్ భార్య కనకదుర్గాభవాని అనారోగ్యంతో మరణించారు. ఆమె దశదిన కర్మను పురస్కరించుకుని రాము అడవిదొడ్లు గ్రామానికి చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఆయన సోదరుడు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజును పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాముతో పాటు ఎంపీపీ గరుడప్రసాద్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.మహేష్, గంగాధర్, భూపతిరాజు, పట్టపు నాని ఉన్నారు.

మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణ పరిధిలో జరుగుతున్న మురుగు కాలువల మరమ్మతు పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో జరుగుతున్న మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీత పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నుంచి రూ.21 లక్షలు మంజూరు చేయించినట్టు చెప్పారు. ఈ నిధులతో పట్టణ పరిధిలో పారిశుధ్య పనులు మెరుగుపడేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. టీడీపీ నాయకులు వాహెబ్‌ఖాన్, రాజా తదితరులు పాల్గొన్నారు.



పెడన 16వ వార్డులో జరుగుతున్న మురుగు కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

చిలకలపూడి(మచిలీపట్నం): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక కేంద్రీయ విద్యాలయంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాల, బాలికల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దన్నారు. 14 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు బడిలోనే ఉండాలని, పనిలోకి వెళ్లకూడదని సూచించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్, హెచ్ఎం జె.గ్లోరి స్వరూప, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, న్యాయవాది అజ్మతున్నీసా పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన అనూహ్య



ఘంటసాల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా తుల్లిమెల్లి అనూహ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అనూహ్యకు మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధి హామీ పథకం ఏపీవో రాజ్ కుమార్, సీవో బాలు, సిబ్బందితో కలసి ఎంపీడీవో అనూహ్యను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందించారు. ఘంటసాల ఎంపీడీవోగా పని చేస్తున్న అనూహ్య ఎన్నికల కోడ్ బదిలీల్లో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు ఎంపీడీవోగా వెళ్లారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా తిరిగి ఘంటసాల వచ్చారు. ఈ సందర్భంగా అనూహ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తానని చెప్పారు.

కృత్తివెన్ను ఎంపీడీవోగా రాంబాబు

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వరుదు రాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా లింగపాలెం ఎంపీడీవోగా పనిచేసిన రాంబాబు కృత్తివెన్నుకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ అభివృద్ధిలో ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సౌకర్యాలను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో చెప్పారు. నూతన ఎంపీడీవోను అధికారులు, సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

విద్యుత్‌శాఖ ఈఈ వెంకటేశ్వర్లు

కోనేరుసెంటర్: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. బందరు మండలం చిన్నాపురం సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ వినియోగదారుల గృహాలు, ఆక్వా చెరువులపై విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ విజయవాడ కె.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆపరేషన్ ఈఈ ఎం.భాస్కరరావుల ఆధ్వర్యంలో ఆపరేషన్ సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి జరిపిన తనిఖీల్లో గృహావసరాల సర్వీసులు 1462, ఆక్వా సర్వీస్ లు 130, ఇతర విభాగాలకు సంబంధించిన సర్వీసులు 50 మొత్తం కలిపి 1670 సర్వీసులు తనిఖీ చేయగా 123 సర్వీసులు అనధికారికంగా అదనపు లోడ్ ఉన్నట్టు గుర్తించారు. సంబంధిత గృహ యజమానులకు 8 లక్షల రూపాయలు జరిమానాగా విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎవరైనా విద్యుత్ చౌర్యం చేస్తుంటే 94408 12362, 94408 12363, 83310 14951 కు సమాచారం అందజేయాలని కోరారు. తనిఖీల్లో మచిలీపట్నం విద్యుత్ శాఖ ఈఈ మన్నెం భాస్కరరావు, మచిలీపట్నం రూరల్ డీఈ ఎం.శ్రీనివాసులు, చిన్నాపురం సెక్షన్ ఏఈ జి.బసవశాస్త్రులు, మచిలీపట్నం డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.